

రైతులకు అండగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

- ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలుచేయాలంటూ రైస్ మిల్లర్లకు ఎమ్మెల్యే సూచన - అలాగే కొంటామంటూ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రకటన

మిర్యాలగూడ, నవంబర్ 10,(ప్రజాజ్యోతి):

మిర్యాలగూడ నియోజకవర్గంలో ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నా రంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో వెంటనే స్పందించిన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్)

వివరాలు 2లో

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

బుధవారం 11 నవంబర్ 2026 పేజీలు:18



నేడు సూర్యాపేట జిల్లాలో మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విస్తృత పర్యటన



- కోదాడ, హుజూర్ నగర్‌లలో రూ. 750 కోట్లకు పైగా అభివృద్ధి పనుల తనిఖీకి ప్రణాళిక
- పలు ఎత్తిపోతల పథకాలు, ప్రభుత్వ భవన నిర్మాణ పనులను పరిశీలించనున్న మంత్రి ఎమ్మెల్యే

కోదాడ టౌన్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి):

సూర్యాపేట జిల్లా పరిధిలో వివిధ రూపుదిద్దుకుంటున్న భారీ అభివృద్ధి, సంక్షేమ పనుల పరిశీలన నిమిత్తం రాష్ట్ర నీటిపారుదల, ప్రాజెక్టుల అభివృద్ధి మరియు ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు సాగే ఈ పర్యటనలో కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల పరిధిలో వందల కోట్ల వ్యయంతో చేపడుతున్న ఎత్తిపోతల పథకాలు, పాఠశాల భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేయనున్నారు.

మిగతా 2 లో

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

- గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం
- ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఆలేరు నవంబర్ 10 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లి గ్రామం, చాడ,కొండాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు.

మిగతా 2 లో

తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన అక్షిత

- భారత జట్టుకు ఎంపికైన క్రీడాకారిణికి అభినందనలు తెలిపిన కేటీఆర్ - అక్షితకు ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



నల్లగొండ నవంబర్ 10, ప్రజా జ్యోతి ప్రతినిధి) :

చింతపల్లి మండలం చాకలి శేరిపల్లి గ్రామానికి చెందిన అక్షిత జాతీయ స్థాయి ట్రోబాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి, భారత జట్టుకు ఎంపిక కావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణ మని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన జాతీయ స్థాయి ట్రోబాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున పాల్గొన్న అక్షిత అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

మిగతా 2 లో

నేడు సూర్యాపేట జిల్లాలో మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విస్తృత పర్యటన

మొదటిపేజీ తరువాయి

ఉదయం 7:25 గంటలకు హైదరాబాద్ లోని తమ నివాసం నుండి బయలుదేరి, బేగంపేట విమానాశ్రయం ద్వారా ప్రత్యేక విమానంలో ఉదయం 8:45 గంటలకు కోదాడ మండలం రెడ్లకుంట చేరుకుంటారు. అక్కడ రూ. 47 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తారు. అనంతరం ఉదయం 9:30 గంటలకు కోదాడ చేరుకుని, ఉదయం 11:30 వరకు పట్టణంలో రూ. 54 కోట్ల రాజీవ్ శాంతినగర్ ఎత్తిపోతల పథకం, రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సమగ్ర గురుకుల పాఠశాల భవనం, రూ. 50 కోట్ల నవోదయ పాఠశాల నిర్మాణం, షాదీ ఖానా, రూ. 5 కోట్ల నీటిపారుదల శాఖ భవనం, రూ. 8 కోట్ల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తారు. ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12:15 గంటల వరకు కోదాడలోని కాకతీయ సేవా సమితి కల్యాణ మండపంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు.?మధ్యాహ్నం 1:00 గంటలకు జనపహాడ్ చేరుకుని రూ. 400 కోట్ల వ్యయంతో చేపడుతున్న జనపహాడ్ ఎత్తిపోతల మరియు కాలువ నిర్మాణ పనులను, మధ్యాహ్నం 1:30 గంటలకు రూ. 40 కోట్ల బెట్ట తండా ఎత్తిపోతల, తనిఖీ ఆకట్టడ పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2:30 గంటలకు హుజూర్ నగర్ చేరుకుని కరక్కాయల గూడెంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 3:30 నుండి సాయంత్రం 4:30 వరకు హుజూర్ నగర్ లోని నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, నీటిపారుదల శాఖ మరియు నూతన భవనాల నిర్మాణ పనులను పరిశీలిస్తారు.సాయంత్రం 4:45 గంటలకు హుజూర్ నగర్ నుండి విమానంలో బయలుదేరి సాయంత్రం 6:00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. మంత్రి పర్యటనలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి పాల్గొంటారు.మంత్రి పర్యటన నేపథ్యంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్, పోలీసు యంత్రాంగం తగిన భద్రత మరియు అధికారిక ఏర్పాట్లు పూర్తి చేశారు.

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

అదేవిధంగా కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను, వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూరైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు, సురక్షితమైన తాగునీరు, నాణ్యమైన రహదారులు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.రైతుల సంక్షేమం గ్రామాల అభివృద్ధి ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షులు కొప్పుల వెంకటరెడ్డి , పిఎసిఎస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం, సర్పంచులు జయమ్మ మదర్ ,బుడగ బాలరాజు,ఆకుల శ్రీనివాస్, బోయినీ జాన్సీ, కొమరయ్య, చందు, రైతులు తదితరులు పాల్గొన్నారు.







రైతులకు అండగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

మొదటిపేజీ తరువాయి

రైతులకు అండగా నిలబడ్డారు మంగళవారం తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు నష్టం కలగకుండా ధాన్యం క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్లను ఎమ్మెల్యే హెచ్చరించారు.రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.అనంతరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి, మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి రైస్ మిల్లులో ధాన్యం క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.ధాన్యం నాణ్యత బాగుంటే రూ.3,500 కంటే ఎక్కువ ధర కూడా చెల్లిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ధర కంటే తగ్గించి కొనుగోలు చేయబోమని రైతులకు హామీ ఇచ్చారు.రైతుల ఆందోళనను వెంటనే గుర్తించి, రైస్ మిల్లర్లతో చర్చించి రైతులకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చొరవపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన అక్షిత

మొదటిపేజీ తరువాయి

ఈ విజయంతో భారత జట్టుకు ఎంపికైన అక్షితను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించి తెలంగాణతో పాటు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అక్షిత క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఆర్థిక సహాయం అందించారు. చింతపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు సైతం ఆమెకు ఆర్థికంగా అండగా నిలిచారు.ఈ నెల నవంబర్ 19 నుంచి 23 వరకు శ్రీలంకలో జరగనున్న ఆసియన్ ట్రోఫీ ఛాంపియన్‌షిప్‌లో అక్షిత భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించనుంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మాచర్ల శ్రీశైలం, అండేకర్ అశోక్, ఉపసర్పంచ్ పగడాల వెంకటయ్య, అక్షిత తండ్రి జగతయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన అక్షిత

- భారత జట్టుకు ఎంపికైన క్రీడాకారిణికి అభినందనలు తెలిపిన కేటీఆర్

- అక్షితకు ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

నల్లగొండ నవంబర్ 10, (ప్రజా జ్యోతి ప్రతినిధి) :



చింతపల్లి మండలం చాకలి శేరిపల్లి గ్రామానికి చెందిన అక్షిత జాతీయ స్థాయి ట్రోబాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి, భారత జట్టుకు ఎంపిక కావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన జాతీయ స్థాయి ట్రోబాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున పాల్గొన్న అక్షిత అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో భారత జట్టుకు ఎంపికైన అక్షితను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించి తెలంగాణతో పాటు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అక్షిత క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఆర్థిక సహాయం అందించారు.

చింతపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు సైతం ఆమెకు ఆర్థికంగా అండగా నిలిచారు.

ఈ నెల నవంబర్ 19 నుంచి 23 వరకు శ్రీలంకలో జరగనున్న ఆసియన్ ట్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో అక్షిత భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మాచర్ల శ్రీశైలం, అండేకర్ అశోక్, ఉపసర్పంచ్ పగడాల వెంకటయ్య, అక్షిత తండ్రి జగతయ్య తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం ప్రకటించాలంటూ ఆర్డివో కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా

మిర్యాలగూడ, నవంబర్ 10,(ప్రజాజ్యోతి):

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన కరువును రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన కరువు మండలాలకు తక్షణ ఆర్థిక సాయం తో పాటు నిత్యవసరాలు అందించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం కరువు మండలాలకు తక్షణ ఆర్థిక సాయం ప్రకటించి రైతులు రుణాలకు రీ షెడ్యూల్ చేసి మాఫీ చేయాలని, నిత్యవసరాల ధరలను తగ్గించి రేషన్ ద్వారా నిత్యవసరాలు అందించాలని సిపిఐ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్టీవో కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ దామరచర్ల మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్, మిర్యాలగూడ మండల కార్యదర్శి అంజనపల్లి రామలింగం, నియోజకవర్గ మహిళా సమైక్య నాయకురాలు దుర్గమ్మ ,శాంత, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డి.లింగ నాయక్ , సీనియర్ నాయకులు తిరుపతయ్య, జమ్ముల కోటయ్య,రాములు తదితరులు ఉన్నారు.





సంఘ సమస్యలపై అవిశ్రాంత పోరాటం చేస్తాం

నగదు రహిత వైద్య సేవలపై అపోహలు వద్దు

విశ్రాంత ఉద్యోగుల హక్కులకై పోరాడతాం

- విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ రెడ్డి





కోదాడ టౌన్ ,నవంబర్ 10 (ప్రజా జ్యోతి):

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర నాయకత్వం రాజీలేని పోరాటం అవిశ్రాంతంగా చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్ లో విశ్రాంత ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగదు రహిత వైద్య సేవలపై ఎవరు కూడా అపోహలు పెట్టుకోవద్దని పూర్తిస్థాయిలో అందరికీ వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో తమ సంఘం రెండున్నర లక్షల సభ్యత్వం కలిగి ఉందన్నారు.పి ఆర్ సి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అమలు చేస్తే జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య మాట్లాడుతూ సంఘ సభ్యులందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకోగలమని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సంఘ సమస్యలపై జరిగే ఐక్య ఉద్యమాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లాలోని అన్ని మండలాల వారిగా పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. విశ్రాంత ఉద్యోగుల మేధోశక్తి ఈ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు తో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన సంఘ సభ్యులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ అసోసియేషన్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా ఇన్చార్జ్ అధ్యక్షులు కే రవీందర్ రెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ పాషా, ప్రసాదరావు, శ్రీనివాసరెడ్డి, విద్యాసాగర్,పొట్ట జగన్మోహన్, రఘువర ప్రసాద్ అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేసిన టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్

భువనగిరి, నవంబర్ 10(ప్రజాజ్యోతి)

భువనగిరి పట్టణంలోని,టూ వీలర్ మెకానిక్ ఉడుత రఘుపతి అకాల మరణం చెందడం జరిగింది.వారి కుటుంబానికి భువనగిరి,మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి కుటుంబానికి సంఘం నుండి,23 వేల రూ,ఆర్థిక సాయం అందజేయడం జరిగింద.ఇట్టి కార్యక్రమంలో సిరిపంగా సుభాష్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,ఎస్.కె కాశీం రాష్ట్ర సహాయ కార్యదర్శి, కులను సతీష్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, దండ బోయిన గణేష్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, చాట్ల జనార్ధన్ పట్టణ అధ్యక్షులు ముద్దం రాజు యాదవ్ పట్టణ ఉపాధ్యక్షులు మాదాస్ వినోద్,గీష కృష్ణ పశుల మధు,ఎస్కే మునీర్ రేపాక నాగరాజు ఉడుత పాండు,నవీన్ తదితరులు పాల్గొన్నారు.



రైతు పండించిన ధాన్యం కొనలేని కాంగ్రెస్ ప్రభుత్వం..

రైతులకు ఏం భరోసా ఇస్తుంది!

- 15 రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్దే రైతుల పడిగాపులు

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- యాసంగి సాగుపై స్పష్టమైన విధానం ప్రకటించాలి

- రైతులను అప్పుల ఊబిలోకి నెట్టొద్దు.. తాటికొండ సీతయ్య డిమాండ్

తుంగతుర్తి, నవంబర్ 10 (ప్రజా జ్యోతి):

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తమ కష్టార్జితమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కుప్పలుగా పోసి దాదాపు 15 రోజులుగా కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడం, అధికారులు కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల భయంతో రైతులు నిత్యం ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు.

మూడేళ్ల పాలనలో రైతులకు మిగిలింది అనిశ్చితి మాత్రమేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతాంగానికి ఇచ్చిన హామీలకు, క్షేత్రస్థాయిలో అమలవుతున్న విధానాలకు పొంతన లేదని సీతయ్య విమర్శించారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, ఇప్పుడు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందో లేదోనన్న అనుమానంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం వారిని కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షించే పరిస్థితికి తీసుకురావడం దురదృష్టకరమన్నారు.

యాసంగి పంటపై స్పష్టత ఏది? రైతులకు ప్రత్యామ్నాయం చూపాలి!

యాసంగిలో వరి పంట సాగు చేయవద్దని సూచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు, మరి రైతులు ఏ పంట సాగు చేయాలో, దానికి మార్కెట్ సౌకర్యం ఏమిటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం వరి సాగు చేయవద్దని చెప్పడం ప్రభుత్వ బాధ్యత కాదని, రైతులకు లాభసాటి ప్రత్యామ్నాయ పంటలను సూచించి, వాటికి గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత కూడా ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.చెరువులు నిండిన ప్రాంతాలు, నీటి వసతి లేని ప్రాంతాలను ఒకే విధంగా పరిగణించకుండా ప్రాంతాలవారీగా వ్యవసాయ విధానాన్ని రూపొందించాలని సూచించారు. సాగునీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో రైతులకు ఎన్ని గంటల విద్యుత్ సరఫరా చేస్తారో ముందుగానే స్పష్టంగా ప్రకటించాలని కోరారు. రైతు తన కుటుంబ అవసరాలకు సరిపడా ఆహార ధాన్యాలను కూడా పండించుకునే పరిస్థితి ఉండాలని, ఆ దిశగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్



చేశారు.ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవసాయ విధానాలను అమలు చేస్తే ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతాంగం మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విత్తనాల ఎంపిక నుంచి పంట సాగు, విద్యుత్ సరఫరా, సాగునీరు, ధాన్యం కొనుగోలు వరకు ప్రతి అంశంలో రైతులకు భరోసా కల్పించే విధంగా ప్రాంతాలవారీగా రైతు అనుకూల వ్యవసాయ విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి తుంగతుర్తి మండలంలోని అన్ని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు చేయాలని తాటికొండ సీతయ్య కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, మండల నాయకులు తునికి సాయిలు గౌడ్, మట్టిపెల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

అంజన్న గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

- 200 మందికి నేత్ర పరీక్షలు

- 35 మందికి శస్త్రచికిత్స

కోదాడ టౌన్ ,నవంబర్ 10 (ప్రజా జ్యోతి):



కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి ప్రోత్సాహంతో కోదాడ 30 వ వార్డు కౌన్సిలర్ కారింగుల ఉమ అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ శిబిరంలో మొత్తం 200 మంది పాల్గొని నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారు.వైద్య పరీక్షల అనంతరం 35 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన వైద్యులు,వారికి చికిత్స చేశారు.పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం పలువురికి ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.సామాజిక బాధ్యతతో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకొచ్చిన కౌన్సిలర్ కారింగుల అంజన్ గౌడ్ కృషిని పలువురు అభినందించారు.ఇటువంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని స్థానికులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చలిగంటి ప్రసాద్,పంది తిరపయ్య ఎన్సిహెచ్ రాము,రాపోలు శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్,వంగవీటి శేఖర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మిట్టకోలు కమలాకర్,చలిగంటి రంగా, తంగెళ్ళపల్లి లక్ష్మణ్, మల్లయ్య, స్టాలిన్,నర్సి, శివ, శేషు,నజీర్, రవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ కు నివాళులు అర్పించిన సంజయ్ దాస్ గౌడ్

చిట్యాల నవంబర్ 10 ప్రజా జ్యోతి

చిట్యాల మండలం తాళ్లవేలంల గ్రామంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు లింగస్వామి మాతృమూర్తి జోగు దుర్గమ్మ మరణించడంతో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ ఉద్యమ నేత కూనూరు సంజయ్ దాస్ గౌడ్ మంగళవారం పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జోగు లింగస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. తల్లిని కోల్పోవడం కుటుంబానికి తీరని లోటు అని, ఆ కుటుంబానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు బాధిత కుటుంబానికి సంజయ్ దాస్ గౌడ్ పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొసనం అశోక్ యాదవ్, జిట్టా మల్లేష్, బత్తుల నాగరాజు గౌడ్,సంఘం నాయకులు, ఉద్యమకారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



నామవరంలో బాధిత కుటుంబాలకు కీసర సంతోష్ రెడ్డి పరామర్శ

- మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు

- గాయపడిన, అనారోగ్యంతో బాధపడుతున్న నాయకులకు పరామర్శ

మోతె నవంబర్10 (ప్రజాజ్యోతి)

మండల పరిధిలోని నామవరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన స్వర్గీయ ఏలేటి వెంకట్ రెడ్డి, స్వర్గీయ బైరి కౌసల్య కుటుంబాలను మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఇటీవల ఘర్షణలో గాయపడిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొక్క చంద్రారెడ్డిని, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన తాటికొండ శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏఐకేయస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

చిట్యాల నవంబర్ 10 ప్రజా జ్యోతి

అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేయస్) జాతీయ మహాసభల సందర్భంగా ఈ నెల 15 వ తేదీ నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభలో యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్,డివైయఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య లు విజ్ఞప్తి చేశారు.చిట్యాల మండల కేంద్రంలో మంగళవారం నాడు జరిగిన రెడ్ షెర్ట్ వాలెంటీర్ల కవాతు శిక్షణ కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు. నల్లగొండ బహిరంగ సభ సందర్భంగా నిర్వహించే బారీ ప్రదర్శన ముందు భాగంలో పది వేల మంది రెడ్ షర్ట్ వాలెంటీర్ ల(యువతి, యువకుల) కవాతు కోసం ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.దేశ వ్యాప్తంగా రైతాంగ పోరాట ఉద్యమం కొనసాగించిన అఖిల భారత కిసాన్ సభ మహాసభలు మొదటి సారి నల్లగొండ జిల్లా కేంద్రంలో జరుపడం ఎంతో గర్వకారణం అని అన్నారు.ఈ కార్యక్రమంలో డివైయఫ్ఐ చిట్యాల మండల కార్యదర్శి కూనూరు గణేష్, యస్ యఫ్ ఐ డివిజన్ అధ్యక్షులు అరూరి ప్రణీత్ , మండల ఉపాధ్యక్షులు కొంపెల్లి భరత్, మండల నాయకులు చంటి,జిట్ట హరీష్,సాయి, యం డి అదిల్, వంశీ,సిద్ధూ, అజిత్, శివ, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వి బి రాంజీ ఉపాధి పనులో కాలువల పూడిక

చిట్యాల నవంబర్ 10 ప్రజాజ్యోతి

చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో వి.బి.రాంజీ ఉపాధి పథకం కింద పెద్ద చెరువు అలుగు నుండి నీరు వృధా కాకుండా కింద ఉన్న గొలుసుకట్టు చెరువులకు నీరు పారే విధంగా కాలువల పూడికలను మంగళవారం సర్పంచ్ కాటశీ వెంకటేశం తీయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు రీత్యా ముందు జాగ్రత్తగా ఇంకుడు గుంతలు, గొలుసుకట్టు కాలువల ద్వారా నీరు వృధా కాకుండా అరికట్టవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు మర్రి హరీష్ రెడ్డి,పంచాయతీ సెక్రెటరీ కృష్ణయ్య, పుల్లారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ చేకూరి మల్లేష్ కారోబార్ మరియు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.





చింతాబాబు మాదిగకు 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్' జాతీయ పురస్కారం

సామాజిక, బహుజన సేవలకు లభించిన అత్యుత్తమ గుర్తింపు

కోదాడ టౌన్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి):

బహుజన హక్కుల పోరాట యోధుడు, ఎమ్మార్పీఎస్ కీలక నేత చింతాబాబు మాదిగను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు వరించింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ ఈ పురస్కారాన్ని ప్రకటించగా, ఈ నెల 15న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నట్లు చింతాబాబు మంగళవారం వెల్లడించారు.గత మూడు దశాబ్దాలుగా సామాజిక రంగంలో చింతాబాబు సేవలు అందిస్తున్నారు. 1990లలో మార్గదర్శి యూత్, స్ఫూర్తి యూత్ సంస్థల ద్వారా యువతను చైతన్యపరుస్తూ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. గతంలో ఫ్రెండ్‌షిప్ సొసైటీ అవార్డులు, 'దళిత రత్న' పురస్కారం పొందడంతో పాటు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా 'మాదిగ బంధు' బిరుదును అందుకున్నారు. జాతీయ స్థాయిలో అంబేద్కర్ అవార్డు ప్రకటనపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

లక్ష్మీప్రియకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రమావత్ రవీంద్ర కుమార్ కుమార్తెకు ఆశీస్సులు అందజేసిన మాజీ మంత్రి

దేవరకొండ, నవంబర్ 10, (ప్రజా జ్యోతి) :

దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ కుమార్తె రమావత్ లక్ష్మీప్రియ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆమెకు





హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.జన్మదినాన్ని పురస్కరించుకుని లక్ష్మీప్రియ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆమెతో ఆత్మీయంగా మాట్లాడి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.తన జన్మదినం సందర్భంగా కేటీఆర్‌ను కలుసుకుని ఆయన అభిమానం, ఆప్యాయతతో కూడిన శుభాకాంక్షలు, ఆశీస్సులు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని లక్ష్మీప్రియ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ ఆత్మీయ కలయిక ఆమెకు ప్రత్యేకమైన జన్మదిన జ్ఞాపకంగా నిలిచింది.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిట్యాల నవంబర్ 10 ప్రజా జ్యోతి

తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన పాకాల రాములమ్మ , బోయ సతెమ్మ , శ్యాం సుందర్ రెడ్డి , మర్రి మాధవి లకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ స్కీం పెద ప్రజలకు వరమని తెలిపారు.ఈ పథకం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సీఎం ఆర్ ఎఫ్ పథకాన్ని చాలా అద్భుతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ సాగర్ల బాను శ్రీ, మర్రి రమేష్, పల్లపు బుద్దుడు, కొనెటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి!

- వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలు సాగు చేయాలి

- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

హాలియా,నవంబర్ 10 (ప్రజా జ్యోతి)

రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుని,వర్షపాతం లోటు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. భూగర్భ జలమట్టాలు తగ్గే ప్రమాదం,నీటి లభ్యతలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో మార్పులు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.మంగళవారం ఆయన అనుముల మండలంలోని పులిమామిడి ఐకేపీ కేంద్రం, సి.నారాయణపురం గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం,భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులు,భూగర్భ జలాల పరిరక్షణ,నీటి పొదుపు ఆవశ్యకతపై రైతులకు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక నీరు అవసరమయ్యే వరి సాగు వల్ల భూగర్భ జలాలపై తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉందని, భవిష్యత్తులో సాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండించే పెసర, మినుము,జొన్న,కంది ఆరుతడి పంటలను సాగు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ పంటల విధానంలో మార్పులు చేసుకోవాలని,పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు.కలెక్టర్ సూచనలపై రైతులు సానుకూలంగా స్పందించారు.తమ మొత్తం సాగు విస్తీర్ణంలో కొంత భాగంలో





మాత్రమే వరి సాగు చేసి, మిగిలిన భూమిలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తామని కలెక్టర్‌కు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పులిమామిడి గ్రామ సర్పంచ్ మాలే అరుణ సత్యనారాయణ రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి బి.వినోద్ కుమార్, జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖర్,హాలియా డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.సరిత, మండల వ్యవసాయ అధికారి ఎం.వెంకన్న,ఉద్యానవన అధికారి మురళి,డీటీ ఎన్.ఎస్. ప్రవీణ్,ఆర్ఐ విఘ్నేశ్వర్ రెడ్డి, ఏపీఎం లక్ష్మీనారాయణ,గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పంటలే మేలు.!

- జిల్లా వ్యవసాయ అధికారి బి.వినోద్ కుమార్

హాలియా,నవంబర్10(ప్రజా జ్యోతి):

వాతావరణ పరిస్థితులు ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున,రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.వినోద్ కుమార్ సూచించారు.మంగళవారం అనుముల మండలంలోని పలు విత్తన దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా దుకాణాలకు వచ్చిన రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వర్షపాతం అంచనాలు,నీటి లభ్యత మరియు భూగర్భ జలమట్టాల పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు.భవిష్యత్తులో ఏర్పడే నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంచుకోవాలని కోరారు.ముఖ్యంగా వరి స్థానంలో తక్కువ నీటితో సాగయ్యే పెసర,మినుము, నువ్వులు వంటి ఆరుతడి పంటలను వేసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని వివరించారు. అలాగే రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలను తగినంత పరిమాణంలో అందుబాటులో ఉంచాలని విత్తన డీలర్లను ఆదేశించారు.రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హాలియా డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.సరిత, మండల వ్యవసాయ అధికారి ఎం.వెంకన్న,ఏఈఓ సత్యనారాయణ,రైతు కొల్లు వెంకటరెడ్డి,రైతులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించాలి

- మిగిలిపోయిన పనులన్నీ వేగంగా పూర్తి చేయాలి..

- నాణ్యమైన వైద్య సేవలు అందించాలి- అధికారులకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం







హాలియా,నవంబర్10(ప్రజా జ్యోతి)

హాలియా పట్టణంలో నూతనంగా నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మిగిలిపోయిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిని త్వరగా ప్రారంభించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం అనుముల మండలం హాలియాలో నూతనంగా నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనితారాణిని ఆసుపత్రి ప్రారంభానికి సంబంధించి చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వైద్య పరికరాలు, ఫర్నిచర్‌ను త్వరితగతిన సమకూర్చుకొని ఆసుపత్రిని ప్రారంభించాలని సూచించారు. అవసరమైన పరికరాలు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఓపీ సేవలు ప్రారంభిస్తామని సూపరింటెండెంట్ కలెక్టర్‌కు వివరించారు.అనంతరం ఓపీ విభాగం, గైనకాలజీ గది,పీడియాట్రిక్ వార్డు,లేబర్ రూమ్,జనరల్ వార్డు, ఫార్మసీ, డిస్పెన్సరీ,ల్యాబొరేటరీ, ఎముకల శస్త్రచికిత్స విభాగం, ఆపరేషన్ థియేటర్లతో పాటు ఇతర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు.ప్రతి విభాగంలోనూ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని,ఆసుపత్రి పరిసరాలు,వార్డులు నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆసుపత్రిలో ఉపయోగించిన సూదులు, సిరంజీలు, కాటన్ తదితర వైద్య వ్యర్థాలు ఎక్కడా కనిపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి వార్డును ప్రతిరోజూ శుభ్రం చేస్తూ పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని విభాగాలకు స్పష్టంగా కనిపించేలా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన ఏర్పాట్లను తప్పనిసరిగా తనిఖీ చేయాలని,అగ్నిమాపక సిబ్బందిని పిలిపించి ఫైర్ సేఫ్టీ పరికరాల పనితీరుతో పాటు వాటి గడువు తేదీలను పరిశీలించాలని ఆదేశించారు.అదేవిధంగా మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీటి లీకేజీలు లేకుండా చూడాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలకు సంబంధించిన ఎమర్జెన్సీ వార్డును పరిశీలించి, అవసరమైన పరికరాలు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా ఆసుపత్రిలో తన భర్తతో కలిసి కూర్చున్న గర్భిణీ మహిళను కలెక్టర్ పలకరించి వైద్య సేవలపై ఆరా తీశారు.ఎక్కడి నుంచి వచ్చారు?ఆసుపత్రిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? వైద్యులు సక్రమంగా వైద్యం అందిస్తున్నారా? అవసరమైన మందులు ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన మహిళ వైద్యులు ఎంతో శ్రద్ధగా వైద్యం అందిస్తున్నారని,బాగా చూసుకుంటున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ భానుప్రసాద్,హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్,ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనితారాణి,డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ స్వాతి,డాక్టర్ నవీన్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు

చిట్యాల నవంబర్ 10 ప్రజాజ్యోతి



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ జన్మదిన సందర్భంగా ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు పుష్ప గుచ్ఛము,శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినందున ఆ స్థానాన్ని ఆర్యవైశ్యుల అమరవాది లక్ష్మీనారాయణకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి ఆర్యవైశ్యులను గౌరవించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వారి వెంటనల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శెట్టి శ్రీనివాస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య జిల్లా నాయకులు నాంపల్లి నరసింహులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎస్ఆర్ఎం విద్యార్థులు

కోదాడ టౌన్,నవంబర్ 10(ప్రజా జ్యోతి):



పట్టణంలోని ఎస్ఆర్ఎం పాఠశాల విద్యార్థులు బాస్కెట్ బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు కోదాడ పట్టణంలోని సీసీ రెడ్డి స్కూల్ ఆవరణలో ఈ నెల 9న నిర్వహించిన బాస్కెట్ బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అండర్ 17 విభాగంలో ఏ షణ్ముఖప్రియ, అండర్ 14 విభాగంలో ఆర్తి శ్రీ, తేజ వికాస్, ఉమా మహేష్ లు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. విజేతలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయం లో ఆకాశ దీపం

చిట్యాల నవంబర్ 10 ప్రజా జ్యోతి

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మొదటి రోజు మంగళవారం చిట్యాల పట్టణంలోని శివాలయంలో సాయంకాలం ఆకాశదీపాన్ని వెలిగించారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాత్రలో దీపాన్ని వెలిగించి జెండా ను ఎగరవేసినట్టుగా పాత్రను ధ్వజస్తంభం చివర పైకి పంపించి ఆకాశదీపాన్ని వెలిగించి పంపించారు. భక్తులు ఆకాశదీపాన్ని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. హర హర మహాదేవ...ఓం నమశ్శివాయ అంటూ భక్తులు పరమశివుడిని కొలిచారు. కార్తీకమాసం సందర్భంగా ఏమాసం మొత్తం ప్రతిరోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తామని పురోహితులు తెలిపారు. కార్యక్రమం లో పురోహితులు గోవింద్ శర్మ, బబ్లు శుక్లా,, శ్రీ కనకదుర్గ దేవాలయం కమిటీ డైరెక్టర్ రుద్రారపు లింగయ్య, వేలుపల్లి రవీందర్, అన్నపూర్ణ, నామని హరిత, రేగొండ వేణుమాధవ్ ఏళ్ల వెంకన్న భక్తులు పాల్గొన్నారు.



చందంపేట విత్తనాల పంపిణీలో అక్రమాలు?

అసలేం జరుగుతోంది.. రైతులకు అందాల్సిన సబ్సిడీ విత్తనాలు పక్కదారి పడుతున్నాయా?



దేవరకొండ, నవంబర్ 10 ,(ప్రజా జ్యోతి) :

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాల పంపిణీపై పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. రైతులకు సక్రమంగా అందాల్సిన విత్తనాలు ప్రైవేటు మిల్లులకు ఎలా చేరు తున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విత్తనాల నిల్వలు, పంపిణీ వ్యవహారంలో పారదర్శకత లోపించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.చందంపేట మండలంలో విత్తనాల పంపిణీ వ్యవహారంపై రైతులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు చేరాల్సిన విత్తనాలు ప్రైవేటు గోదాములు, మిల్లుల్లో నిల్వ ఉండటానికి కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు. విత్తనాల నిల్వకు అనుమతులు ఎవరు ఇచ్చారు? వాటి పర్యవేక్షణ బాధ్యత ఎవరిపై ఉంది? అర్హులైన రైతులకు కాకుండా ఇతరులకు విత్తనాలు చేరుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

సబ్సిడీ విత్తనాల పంపిణీలో పారదర్శకత పాటించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. విత్తనాల నిల్వలు, సరఫరా వివరాలు, లబ్ధిదారుల జాబితా, పంపిణీ రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

జిల్లా అధికారుల విచారణకు ఆదేశిస్తారా?

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు. సబ్సిడీ విత్తనాల పంపిణీలో అక్రమాలు జరిగాయా? నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు కొనసాగుతున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ సబ్సిడీ లక్ష్యం నీరుగారకుండా, అర్హులైన రైతులకు విత్తనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రజా పోరాటాలే ఆకర్షణ.. సీపీఎంలోకి 10 కుటుంబాలు!

- వివిధ పార్టీలకు రాజీనామా చేసి సీపీఎంలో చేరిన యువకులు

- ఎర్రజెండా కండువాలు కప్పి ఆహ్వానించిన జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

- ప్రజా హక్కుల కోసం నిరంతర పోరాటమే సీపీఎం లక్ష్యం

మోతె, నవంబర్ 10 (ప్రజా జ్యోతి):

మోతె మండలంలో సీపీఎం పార్టీ నిర్వహిస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితులై పది కుటుంబాలకు చెందిన యువకులు పార్టీలో చేరడం ఆశించదగిన పరిణామమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామంలో చింతమల్ల రాజు నాయకత్వంలో వివిధ పార్టీలకు చెందిన పది కుటుంబాల యువకులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి సీపీఎంలో చేరారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు నూతనంగా పార్టీలో చేరిన వారికి ఎర్రజెండా కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం మల్లు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. సీపీఎం పార్టీ నిరంతరం కష్టజీవుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తోందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా ఆర్థిక అసమానతలు కొనసాగుతుండటం ఆందోళనకరమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా యువత ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.మోతె మండలంలో సీపీఎం బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతోందని, పార్టీలో చేరిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ నెల 15న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు మోతె మండలం నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.సీపీఎం గ్రామ కార్యదర్శి షేక్ జహీనాభి అధ్యక్షతన జరిగిన



ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, మండల కమిటీ సభ్యులు నాగం మల్లయ్య, చర్లపల్లి మల్లయ్య, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి వెలుగు మధు, డీవైఎఫ్ఐ నాయకులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్‌లు, గోదాముల నిర్మాణం!

- వారం రోజుల్లోనే శంకుస్థాపనకు చర్యలు- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆరుతడి పంటలు సాగు చేయాలి

- రైతులకు సూచించిన జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

హాలియా,నవంబర్10 (ప్రజా జ్యోతి)

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు విధానాలను మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు.తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంటలను ఎంచుకోవాలని తెలిపారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్‌లు, గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని,అనువైన భూమి అందుబాటులో ఉంటే వారం రోజుల్లోనే శంకుస్థాపన చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు.మంగళవారం అనుముల మండలం శ్రీనాధపురం గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంట ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజ్‌లు, గోదాముల్లో భద్రపరిచి మార్కెట్‌లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. రైతులందరూ సమష్టిగా ముందుకు వస్తే ప్రభుత్వం ద్వారా అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద గోదాముల నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తామని పేర్కొన్నారు.కోల్డ్ స్టోరేజ్‌లు,గోదాములు అందుబాటులోకి వస్తే రైతులు పంట చేతికి వచ్చిన వెంటనే తక్కువ ధరకు విక్రయించాల్సిన అవసరం ఉండదని, అనుకూలమైన ధర లభించే వరకు నిల్వ చేసుకునే అవకాశం



ఉంటుందని వివరించారు.ఈ అంశంపై రైతులందరితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గోదాముల నిర్మాణం, పంటల సాగు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నప్పటికీ రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు కూడా రానున్న రోజుల్లో తగ్గే అవకాశం ఉందని,అందువల్ల తక్కువ విస్తీర్ణంలో, తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్, ధరలు ఉన్న పంటలను ముందుగానే గుర్తించి సాగు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా 100 రోజుల్లో చేతికి వచ్చే పంటలకు మార్కెట్‌లో ఎంత మేరకు గిరాకీ ఉందో



పరిశీలించాలని,శ్రీరామనవమి వరకు వాతావరణ,నీటి పరిస్థితులను గమనించి తదుపరి సాగుపై నిర్ణయం తీసుకోవాలని రైతులకు సూచించారు.చిక్కుడు, మినుములు,కందులు వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు.రైతుల్లో డిగ్రీలు చదువుకున్న వారు కూడా ఉన్నారని,వారు వ్యవసాయ రంగంలో నూతన ఆలోచనలు,ఆధునిక పద్ధతులతో ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శేఖర్,డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, గ్రామ సర్పంచ్ మల్ రెడ్డి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరువువ్వలోనూ ప్రజలకు అండగా ఉంటాం : వేముల వీరేశం

- రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు

- కృష్ణా, మూసీ నీళ్లతో చెరువులు నింపుతాం

చిట్యాల నవంబర్ 10(ప్రజా జ్యోతి);

ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుంది, రైతులు ఎవ్వరూ బయట మార్కెట్‌లో తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.చిట్యాల టౌన్‌లో ఏర్పాటు చేసిన ఎఫ్పీఓ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ నీనో వల్ల దేశవ్యాప్తంగా కరువు పరిస్థితి ఉందని, తెలంగాణలో కరువును అధిగమించి ముందుకు పోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారని అన్నారు.మన నకిరేకల్ నియోజకవర్గంలో చిట్యాల మండలంలో మూసీ నీళ్ల ద్వారా గుండ్రాపల్లి, సుంకనపల్లి, పెద్దకాపర్తి, వెలిమినేడు, ఉరుమడ్ల వరకు నీళ్లు నింపుతున్నామని, ఇటు బ్రాహ్మణ వెల్లంల, ఉదయ సముద్రంను నింపి అక్కడి నుండి నేరడ చెరువులను, పక్కన ఉన్న నార్కెట్‌పల్లి గ్రామ పెద్ద చెరువును నింపే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.ధర్మారెడ్డి కాల్వను ఈ డిసెంబర్ వరకు పూర్తి చేస్తానని



అన్నారు.అలాగే కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి మండలాల్లో కృష్ణా నీళ్ల ద్వారా అందుబాటులో ఉన్న చెరువులను నింపే ప్రయత్నం చేస్తున్నామని, ఈ నీటిని త్రాగునీటి అవసరాలకు వాడుకుంటూ వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూసుకుందామని అన్నారు. ప్రతిపక్షానికి బాధ్యత ఉండాలని, కరోనా సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండి బాధ్యతగా పనిచేయకపోయినా కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేయకుండా కష్టకాలంలో ప్రజలకు భరోసా ఇచ్చిందని,



కానీ ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ ఎల్ నీనో పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని విమర్శిస్తుందని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ విజ్ఞతను ప్రజలు ప్రశ్నించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం కరువు పరిస్థితిలో ఉపాధి విషయంలో కానీ, అభివృద్ధి విషయంలో కానీ వెనుకడుగు వేయదని, ప్రజలకు అండగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో విజయ్ కుమార్ మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరా వినోద మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీ లక్ష్మీ సైదులు,కౌన్సిలర్లు జర్రిపోతుల సత్యనారాయణ గౌడ్,నాగిళ్ల సుధాకర్,కుక్కల మోహన్,బొబ్బిలి సందీపారామిరెడ్డి,కో ఆప్షన్ సభ్యులు బెల్లి సత్తయ్య, జిల్లా నాయకులు పోకల దేవదాస్, మండల పట్టణ పార్టీ అధ్యక్షులు జడలచిన మల్లయ్య,ఎద్దులపురి కృష్ణ నాయకులు గుడిపాటి లక్ష్మీనరసింహ, పాటి నర్సిరెడ్డి,కోమటిరెడ్డి రామిరెడ్డి,అద్దెల లింగారెడ్డి, ఎస్.కె ఇబ్రహీం,స్థానిక నాయకులు, రైతులు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

హాలియా,నవంబర్ 10 (ప్రజా జ్యోతి):

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి సూచించారు.హాలియా ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు,అందుబాటులో ఉన్న సౌకర్యాలు,పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వైద్య సేవల్లో నాణ్యతను పెంపొందిస్తూ ప్రజలకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.అదేవిధంగా ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్య సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజారమేష్ యాదవ్,కౌన్సిలర్లు చిట్టిపోలు కరుణసాగర్,ఎం.డి. మజహార్,చెరుపల్లి ముత్యాలు, యడవెల్లి రంజిత్,కో-ఆప్షన్ సభ్యులు వర్కాల శేఖర్ రెడ్డి, ఎం.డి. రషీద్,ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





నేలతీరును బట్టి పంటల సాగు చేయ్యాలి..

- ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత ఉండొద్దు..

- రైతులు వరి సాగుతో పాటు ఆరుతడి పంటలపై దృష్టిసారించాలి ..

- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి.- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి..

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్





నల్గొండ నవంబర్ 10 (ప్రజాజ్యోతి):

రైతులు భూమి స్వభావం, నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని, కొనుగోళ్లు, ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం అనుముల మండలం పులిమామిడి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఇప్పటివరకు 64 మంది రైతులు ధాన్యం తీసుకువచ్చినట్లు నిర్వాహకులు వివరించగా, రైతులకు ఇబ్బందులు కలగకుండా వరుస సంఖ్యల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. అవసరమైన గన్నీ సంచులు, లారీలు, హమాలీలను వెంటనే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించేందుకు తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. రెండు ఎకరాల భూమి ఉన్న రైతులు ఒక ఎకరంలో వరి సాగు చేసి, మిగిలిన భూమిలో ప్రత్యామ్నాయ పంటలు వేసేలా ఆలోచించాలని సూచించారు. సన్న రకం వరి సాగుకు ప్రభుత్వం సూచించిన విత్తన రకాలనే ఎంపిక చేసుకోవాలన్నారు. గ్రామంలో కుసుమ పంట సాగును ప్రోత్సహించడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలు, ప్రాసెసింగ్



యూనిట్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. రైతులు సంఘటితంగా సామూహిక వ్యవసాయం చేపడితే మరింత ప్రయోజనం ఉంటుందన్నారు.గ్రామంలో సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత కల్పించాలని సర్పంచ్‌కు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ అరుణ, సత్యనారాయణ రెడ్డి, ఏఈఓ మహేష్, జీపీఓ స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి: బీర్ల అయిలయ్య

ఆత్మకూర్ ఎం నవంబర్ 10 (ప్రజా జ్యోతి)



అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆత్మకూర్ మండల కేంద్రంలోని జె.ఎస్. గార్డెన్స్‌లో అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. పేద ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో లబ్ధిదారులకు ప్రభుత్వ రేషన్ సేవలు మరింత సులభతరం అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు..

అమెరికాలో అదృశ్యమైన నల్లగొండ యువతి శ్రీజ..

ఆచూకీ కోసం తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు..

- ఆచూకీ కోసం కేటీఆర్‌కు కంచర్ల విజ్ఞప్తి.. శ్రీజ తల్లిదండ్రులను ఫోన్లో పరామర్శించిన కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డి..

- కుటుంబానికి అండగా ఉంటామని భరోసా.. - మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి





నల్లగొండ, నవంబర్ 10 (ప్రజాజ్యోతి):

అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన యువతి శ్రీజ అదృశ్యం కావడంతో ఆమె కుటుంబం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. కనగల్ మండలం శాబుల్లాపూర్ గ్రామానికి చెందిన శ్రీజ బోస్టన్ విశ్వవిద్యాలయంలో చదువుకుంటోంది. ఈ నెల 2వ తేదీ నుంచి ఆమె కనిపించకుండా పోవడంతో ఇప్పటివరకు ఆచూకీ తెలియక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.విషయం తెలుసుకున్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మంగళవారం శ్రీజ కుటుంబాన్ని పరామర్శించి, వారి ఆవేదనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల పరిస్థితిని, కుమార్తె ఆచూకీ లభించక వారు పడుతున్న వేదనను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లారు.దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్ శ్రీజ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆందోళన చెందవద్దని, శ్రీజ ఆచూకీ కనుగొనేందుకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. అమెరికాలో తనకు పరిచయం ఉన్నవారితో మాట్లాడి అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అదేవిధంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సైతం శ్రీజ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని, శ్రీజ ఆచూకీ కనుగొనేందుకు అన్ని విధాలా సహకరిస్తామని మీరు అధైర్యపడవద్దని కంచర్ల భూపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు.విదేశాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లిన తమ కుమార్తె క్షేమంగా తిరిగి రావాలని తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. శ్రీజ ఆచూకీ త్వరగా లభించాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి..

- వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించొద్దు..

- అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

- అంతర్జాల మోసాలపై అప్రమత్తత అవసరం..

- మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాలి..



నల్లగొండ నవంబర్ 10,(ప్రజా జ్యోతి):

సైబర్ నేరాలు, అంతర్జాల మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను మంగళవారం ఆయన అదనపు ఎస్పీ జి. రమేష్, సైబర్ నేరాల విభాగం డీఎస్పీ టి. లక్ష్మీనారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బ్యాంకు అధికారులమని, ఇతర సంస్థల సిబ్బందిమని ఫోన్ చేసే గుర్తుతెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ గోప్య సంకేతాలు, ఏటీఎం రహస్య సంఖ్యలు, ఖాతా వివరాలు, సంకేతపదాలు వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద ఫోన్‌కాల్స్, సందేశాలు, అంతర్జాల లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సమాచారం వచ్చినప్పుడు తొందరపడకుండా పరిశీలించి నిర్ధారించుకోవాలని కోరారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయాలని, ఎఽఽ.ఎఎవతీఽతీఅఎవ.స్రశీఙ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఫిర్యాదుల కోసం 8712672222 వాట్సాప్ నంబరును కూడా వినియోగించుకోవచ్చన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో డీ4సీ విభాగం ద్వారా జిల్లావ్యాప్తంగా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముదిరాజ్ సంఘాన్ని బలోపేతం చేయాలి

- కూర వెంకటేష్

భువనగిరి, నవంబర్ 10 (ప్రజాజ్యోతి)

భువనగిరి పట్టణంలోని వై,ఎస్ ఆర్,ఫంక్షన్ హాల్ లో ముదిరాజ్ ల ముఖ్య సమావేశం జరిగింది. భువనగిరి పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలోని







35,వార్డుల ముదిరాజ్ లు సాయి బాబా గుడి నుండి వై ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సమావేశంలో ముదిరాజ్ సమన్వయ కమిటీ అధ్యక్షతన భువనగిరి పట్టణంలోని 35 వార్డుల సభ్యత్వం నమోదు మరియు కుటుంబ సర్వే చేయడం కోసం తీర్మానం చేయడం అయినది మరియు సభ్యత్వ నమోదు పూర్తి అయిన తరువాత పట్టణ కమిటీ ఎన్నిక జరుగుతుంది అని తీర్మానం చేయడం అయినది ఈ సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు మంద యాదగిరి,కొల్పుల కమలాకర్,దిడ్డికాడి నర్సింగ్ రావు, నాయిని పూర్ణ చందర్,వల్దాసు సుదర్శన్ మున్సిపల్ కౌన్సిలర్ లు గుర్రాల సంతోష శ్రీనివాస్,జంగిటి వినోద్,సాదు రామకృష్ణ మరియు 35 వార్డుల ముదిరాజ్ సంఘ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

రాములమ్మ మృతి సీపీఐ కి తీరని లోటు

వలిగొండ నవంబర్ 10 (ప్రజాజ్యోతి న్యూస్)

వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎలగందుల అంజయ్య మాతృ మూర్తి ఎలగందుల రాములమ్మ మంగళవారం వేకువజామున అనారోగ్యంతో మృతి చెందారు. సీనియర్ కార్యకర్త ఎలగందుల రాములమ్మ మృతి పార్టీకి తీరని లోటు అని పలువురు అన్నారు. ఆమె మృత దేహాశీ పై ఎర్ర జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులు అర్పించి సంతాపశీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, తెలంగాణ ఉద్యమ కారుల సంఘం



ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, నాయకులు పులిపలుపుల మల్లేశం,పోషణ పోయిన బొందయ్య, పోలేపాక యాదయ్య, బొడిగె సుదర్శన్, గుండెగాని నాగరాజు,కొయ్యగూర రామల్లు, తాలూక యాదయ్య, ఆకుల శ్రీను, పులిపలుపుల కిష్టయ్య, అంబటి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధికార ప్రతినిధిగా వంగాల వెంకన్న గౌడ్

వలిగొండ నవంబర్ 10(ప్రజా జ్యోతి న్యూస్):

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధికార ప్రతినిధిగా మండలంలోని నాగారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు వంగాల వెంకన్న గౌడ్ నియమితులయ్యారు. కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘమైన ఎన్ఎస్యూఐలో పనిచేసిన ఆయన, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీకి ఆయన అందించిన సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం టీపీసీసీ మీడియా, పబ్లిసిటీ విభాగం ద్వారా అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకంపై వెంకన్న గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నియామకం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, ఉద్యమకారులు, గ్రామస్తులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

వలిగొండ నవంబర్ 10(ప్రజా జ్యోతి న్యూస్)

:మండలంలోని సుంకిశాల, పులిగిల్ల, కేర్చిపల్లి, వెల్వర్తి గ్రామ పంచాయతీలను ఎంపీడీవో జలంధర్ రెడ్డి మంగళవారం సందర్శించి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఈనెల 12 నుంచి 18 వరకు చేయూత పింఛన్ల పంపిణీ..

- అర్హులందరికీ పండుగ వాతావరణంలో పింఛన్లు అందించాలి..

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్- 20 పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం వారంలోగా పూర్తి చేయాలి..

- బడి మానేసిన 800 మంది విద్యార్థులను తిరిగి చేర్పించాలి..


- జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో.. జిల్లా కలెక్టర్

నల్లగొండ, నవంబర్ 10 (ప్రజాజ్యోతి):

ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు మండలాల వారీగా చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వివిధ అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, పండుగ వాతావరణంలో పింఛన్లు అందించాలని సూచించారు. ప్రజాప్రతినిధుల సమ్మతితో పంపిణీ తేదీలను ఖరారు చేయాలని, అనర్హులకు పింఛన్లు మంజూరు చేయకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. తిరస్కరించిన దరఖాస్తులకు సరైన కారణాలను గ్రామపంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలన్నారు.వీబీజీ రామ్ జీ పథకం కింద అన్ని గ్రామపంచాయతీల్లో పనులు వెంటనే ప్రారంభించి, కూలీల హాజరు పెంచాలని, మంజూరైన పనులన్నీ ప్రారంభించాలని సూచించారు. కాలువల్లో పిచ్చిమొక్కల తొలగింపు, పూడికతీత పనులకు నీటిపారుదల శాఖ అధికారులు వారంలోగా ప్రణాళికలు రూపొందించి ఎంపీడీవోలకు అందించాలన్నారు. ఇంకుడు గుంతలు, బోరు బావుల నీటి పునరుద్ధరణ నిర్మాణాలు,



వర్షపు నీటి సంరక్షణ పనులను అన్ని గ్రామాల్లో చేపట్టాలని, ముందుగా నమూనా గ్రామాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశువులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా అన్ని గ్రామాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేయాలని, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాసం పెంచాలని సూచించారు. పశువులు, మేకలకు నీటి సౌకర్యం కల్పించే బాధ్యతను పశువైద్యాధికారులు తీసుకోవాలన్నారు. మరమ్మతులు అవసరమైన తొట్లను ఎంపీడీవోలు బాగు చేయించాలని, నెలాఖరులోగా నీటి తొట్లు లేని ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జిల్లాలో ఇంకా 20 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని



గుర్తించామని, వెంటనే పనులు ప్రారంభించి వచ్చే వారంలోగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 800 మంది విద్యార్థులు బడి మానేసినట్లు గుర్తించామని, తహసీల్దార్లు, ఎంఈవోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు వారి ఇళ్లకు వెళ్లి తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి సుశేందర్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కరువుతో నష్టపోయిన తెలంగాణ రైతులకు కేంద్రం రూ.25 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి.

- సీపీఐ నేరేడుగొమ్ము మండల కార్యదర్శి బొమ్ము రామాంజనేయులు

దేవరకొండ, నవంబర్ 10, (ప్రజా జ్యోతి) :

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి కరువు పరిస్థితులు నెలకొనడంతో తెలంగాణలో రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ నేరేడుగొమ్ము మండల కార్యదర్శి బొమ్ము రామాంజనేయులు అన్నారు. కరువుతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ. 25 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.నేరేడుగొమ్ము తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించడంతో పాటు వ్యవసాయ కూలీలు, ఉపాధి కోల్పోయిన కార్మికులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కోరారు.అనంతరం ఇన్‌చార్జి ఆర్ఐ సునీల్‌కు వినతిపత్రం అందజేసి, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, తాగునీరు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టపరిహారం, ఉపాధి కల్పన, నిత్యావసర సరుకుల పంపిణీ, తాగునీటి సరఫరాకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోకపోతే ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులు, కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం సీపీఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు మషాబోయిన బిక్షమయ్య, బెజవాడ లక్ష్మయ్య, బిక్షమయ్య, సైదులు, మంగు నాయక్,



వెంకటయ్య, అంబలి, బామిని, వెంకటి, హనుమంతు, బురో, గణేష్, రమేష్, రతన్, కొండల్, శంకర్, శ్రీను, వెంకటమ్మ, అంజమ్మ, శ్రీకాంత్, కే. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలి

- విద్యార్థులే నీటి సంరక్షణ వారియర్స్‌గా ఎదగాలి

- ఫిట్‌నెస్,ఆరోగ్యం,చదువుకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి

- విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచన







హాలియా,నవంబర్ 10 (ప్రజా జ్యోతి)

ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించు కోవాలని,నీటి సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సూచించారు. ప్రతి విద్యార్థిని నీటి సంరక్షణ వారియర్‌గా ఎదగాలని, జీవితంలో ఫిట్‌నెస్, ఆరోగ్యం,చదువుకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. మంగళవారం హాలియాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి నీటి వినియోగం,విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పాఠశాలలో నీటి వృథాను అరికట్టాలని,వృథాగా వెళ్లే నీటిని తిరిగి వినియోగించుకునేందుకు డ్రై డ్రెయిన్, సోక్‌పిట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకోసం ఎస్ఎస్ కమిటీ ద్వారా తీర్మానం చేయిస్తే కలెక్టర్ నిధుల నుంచి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. వారానికి రెండుసార్లు విద్యార్థులతో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు.అనంతరం తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లాడి వారి చదువు, భాషా పరిజ్ఞానాన్ని పరిశీలించారు. పాఠశాల కార్యక్రమాల్లో ప్రతి విద్యార్థిని చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించాలని, వేదికపై మాట్లాడే భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసం పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎవరికి భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు భరోసా ఇచ్చారు.ప్రతి విద్యార్థిని శారీరక దృఢత్వం, ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ చదువులోనూ రాణించాలని అన్నారు. విద్యార్థినులందరికీ జనన, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతలను అలవర్చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, కమిషనర్ రవీందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కుకడాల హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి జిల్లా మహిళా కాంగ్రెస్ పగ్గాలు!

అనురాధ కిషన్ రావుకు మరోసారి అధ్యక్ష బాధ్యతలు

- మహిళా కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం..

- మహిళలను రాజకీయ చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతా: అనురాధ కిషన్ రావు



తుంగతుర్తి, నవంబర్ 10 (ప్రజా జ్యోతి):

సూర్యాపేట జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు ముచ్చటగా మూడోసారి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వరుసగా మూడోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టే అవకాశం దక్కడం పట్ల కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా అనురాధ కిషన్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు, గ్రామస్థాయి నుంచి మహిళలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తానని పేర్కొన్నారు. మహిళలు రాజకీయంగా చైతన్యవంతులై ప్రజా సమస్యల పరిష్కారంలో క్రియాశీలక పాత్ర పోషించేలా అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆపదలో ఆదుకున్న చిన్ననాటి స్నేహితులు..

సునీత కుటుంబానికి ఆర్థిక చేయూత..

ఆత్మకూరు ఎం నవంబర్ 10 (ప్రజా జ్యోతి)

తమతో కలిసి చదువుకున్న సహచర విద్యార్థిని కుటుంబం ఆపదలో ఉందని తెలుసుకున్న 2009-10 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మానవతా దృక్పథంతో స్పందించారు. మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన సునీత భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో స్నేహితులంతా కలిసి రూ.55 వేల విరాళాలు సేకరించి మంగళవారం ఆమెకు అందజేశారు. కష్టసమయంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ సునీత కృతజ్ఞతలు తెలిపారు. చదువుకున్న నాటి అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆపదలో చేయూతనిచ్చిన పూర్వ విద్యార్థులు స్నేహబంధానికి ఆదర్శంగా నిలిచారు.ఈ కార్యక్రమంలో సరిత, సంగీత, సరిత, మమత, బాలరాజు, కిరణ్, ఉదయ్ కుమార్, మధు, సందీప్, మహేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



శ్రీజా ఆచూకీ కోసం మంత్రి కోమటిరెడ్డి నిరంతర ప్రయత్నాలు..

- తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకుని ప్రత్యేక చొరవ..

- అమెరికా అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు..

- శ్రీజ కుటుంబానికి అండగా ఉంటాం..- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ నవంబర్ 10, (ప్రజా జ్యోతి):



అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తూ అదృశ్యమైన నల్లగొండకు చెందిన కోయ శ్రీజా రెడ్డి ఆచూకీ కోసం రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిరంతరం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. కుమార్తె ఆచూకీ తెలియక తీవ్ర ఆందోళనలో ఉన్న శ్రీజా తల్లిదండ్రుల బాధను అర్థం చేసుకున్న మంత్రి, ఆమెను క్షేమంగా తిరిగి తీసుకురావడానికి అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో చదువుకుంటున్న శ్రీజా ఆచూకీని త్వరగా కనుగొనాలని ఇప్పటికే బోస్టన్ భారత కాన్సులేట్ జనరల్, కేంద్ర విదేశాంగ శాఖ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఈ-మెయిల్స్ ద్వారా విజ్ఞప్తి చేశారు. తాజాగా బోస్టన్‌లోని తానా ప్రతినిధి కృష్ణప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి, స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని కోరారు.మంత్రి విజ్ఞప్తుల మేరకు తాన ప్రతినిధులు బోస్టన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడారు. కేసు దర్యాప్తు పురోగతి, శ్రీజ ఆచూకీకి సంబంధించిన తాజా వివరాలను తెలుసుకుంటున్నారు. స్థానిక పోలీసుల సహకారంతో ఆమె కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని కృష్ణప్రసాద్ మంత్రికి వివరించారు. మరోవైపు శ్రీజ క్షేమంగా తిరిగి వచ్చే వరకు ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు దర్యాప్తు వివరాలను అందించాలని బోస్టన్ భారత కాన్సులేట్ జనరల్‌ను మంత్రి కోరారు. మంత్రి కార్యాలయం నుంచి ప్రతి గంటకోసారి సంబంధిత అధికారులతో సంప్రదిస్తూ తాజా సమాచారాన్ని సేకరిస్తున్నారు.

శ్రీజ కుటుంబానికి అండగా ఉంటాం..మంత్రి

శ్రీజ ఆచూకీ లభించే వరకు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని మంత్రి భరోసా ఇస్తూ, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అన్ని స్థాయిల్లో సమన్వయంతో చర్యలు కొనసాగిస్తున్నారు. శ్రీజ త్వరగా క్షేమంగా కుటుంబ సభ్యుల చెంతకు చేరుకోవాలని తల్లిదండ్రులు, బంధువులు, తానా ప్రతినిధులు, అధికారులు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

ఇథనాల్ కంపెనీ ఏర్పాటుతో ఆహార ధాన్యాలు, నీటి కొరత వస్తుంది

ఈ నెల 20న వీర్లపాలెంలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలి

జెవివి జాతీయ నాయకులు డాక్టర్ మువ్వా రామారావు, రవి

మిర్యాలగూడ, నవంబర్ 10, (ప్రజాజ్యోతి):

ఇథనాల్ కంపెనీ ఏర్పాటు వల్ల ఆహార ధాన్యాల కొరతతో పాటు నీటి సమస్య తీవ్రమవుతుందని, కాలుష్యం పెరిగి పర్యావరణ అసమతుల్యంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకుడు కన్నెగంటి రవి అన్నారు. ఈ నెల 20న, దామరచర్ల మండలం వీర్లపాలెంలో సోహమ్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇథనాల్ కంపెనీ ఏర్పాటుపై జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో అనుసరించాల్సిన అంశాలపై మంగళవారం మిర్యాలగూడలో చర్చా కార్యక్రమనిర్వహించారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఇథనాల్ తయారీకి రోజుకు 25 లక్షల లీటర్ల నీటిని కృష్ణానది నుంచి వినియోగించేందుకు ప్రతిపాదించారని, రోజుకు సుమారు 1,350 టన్నుల ధాన్యం నూకలు, బియ్యం లేదా మొక్కజొన్నలు అవసరమవుతాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తాగు, సాగునీటికి కొరత ఏర్పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేస్తే ఆహార ధాన్యాలు, నీటి లభ్యతపై మరింత ఒత్తిడి పడుతుందని, కొరత ఏర్పడుతుందని



ఆందోళన వ్యక్తం చేశారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకుడు డాక్టర్ మువ్వా రామారావు మాట్లాడుతూ ఇథనాల్ తయారీ ప్రక్రియలో వెలువడే ఉద్గారాలు, ఇతర కాలుష్య కారకాల వల్ల స్థానిక ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, అదానీ సిమెంట్ పరిశ్రమల కారణంగా కాలుష్య సమస్యలు ఉన్నాయని, మరో పరిశ్రమ ఏర్పాటు వల్ల పర్యావరణంపై అదనపు భారం పడుతుందన్నారు.ఈ నెల 20న జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో ఇథనాల్ తయారీకి అవసర ధాన్యాలను ఎక్కడి నుంచి సమకూరుస్తారు, రోజువారీ నీటి అవసరాలను ఎలా తీర్చుకుంటారు, పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్య ఉద్గారాల ప్రభావం ఏమిటి అనే అంశాలపై ప్రజలు



అధికారులను ప్రశ్నించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బీసం రామయ్య, ఎంసీపీఐ రాష్ట్ర నాయకుడు వస్కుల మట్టయ్య, కుల వివక్ష వ్యతిరేక కమిటీ రాష్ట్ర నాయకుడు లక్ష్మయ్య, హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకులు వీరస్వామి, సంజీవ్, కిరణ్మయి, డాక్టర్ భవాని, పద్మ, రామచంద్రయ్య, న్యూ డెమోక్రసీ నాయకులు జ్వాల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, వినోద్ కుమార్, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు బెల్లంకొండ హరికృష్ణ, డాక్టర్ సాహితి పాల్గొన్నారు.



ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్ కు పెన్ పహాడ్ పోలీస్ దీపిక ఎంపిక

పెన్ పహాడ్ నవంబర్ 9 (ప్రజాజ్యోతి):

ఉత్తరప్రదేశ్లో జరగనున్న ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్ కు పెన్ పహాడ్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న నందిపాటి దీపిక ఆల్ ఇండియా గేమ్స్ సెలక్షన్ టీం ఎంపిక చేసినది చిన్నప్పటి నుంచి స్కూల్ కాలేజ్ యూనివర్సిటీ తరపున టోర్నమెంట్లో పాల్గొని పోలీస్ డిపార్ట్మెంట్లో ఉద్యోగం సంపాదించిన తర్వాత మూడు సంవత్సరాల నుంచి 2025 పంజాబ్,2026 జమ్మూ కాశ్మీర్ జరిగిన ఆల్ ఇండియా పోలీస్ క్రీడలలో స్పోర్ట్స్ మీట్ కు తెలంగాణ పోలిస్ టీం తరపున ఎంపిక అయినారు మరల 2027 సం.లో ఉత్తర ప్రదేశ్ జరగబోవు తెలంగాణ పోలిస్ టీం తరపున నేషనల్ కి సెలెక్ట్ అయిన నందిపాటి దీపిక పెన్ పహాడ్ పోలిస్ స్టేషన్ లో మహిళ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. పొనుగోడు గ్రామానికి చెందిన నందిపాటి దీపిక నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ చిన్నతనము నుండే చదువుతోపాటు క్రీడలలో కూడా ముందంజలో రావడం, దీపిక తండ్రి నందిపాటి నాగేంద్ర బాబు ప్రోత్సాహం కష్టపడి చదువుకొని పోలీసు ఉద్యోగం సాధించి క్రీడలలో కూడా దీపిక ముందంజకు రావడం వారి కుటుంబంలో సంతోషాలు వెల్లువిరిసినాయి, పెన్ పహాడ్ పోలీస్ స్టేషన్లో ఎస్సై బాలు నాయక్ తో పాటు పోలీసు వారి బృందం అభినందనలు తెలిపినారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవం అధ్యక్షుడిగా రెండోసారి ముత్తినేని వెంకన్న

- ప్రధాన కార్యదర్శిగా వరుసగా రెండోసారి సూరారపు లింగయ్య

పెన్ పహాడ్, నవంబర్ 10 ప్రజా జ్యోతి):



తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం టీఎస్ యూటీఎఫ్ పెన్ పహాడ్ మండల శాఖ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన సమావేశంలో పెన్ పహాడ్ మండల నూతన కార్యవర్గాన్ని ఉపాధ్యాయ లోకం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సంఘం బలోపేతానికి, ఉపాధ్యాయుల హక్కుల రక్షణకు నిరంతరం శ్రమిస్తున్న సమర్థులైన నాయకత్వానికే ఉపాధ్యాయులు మరోసారి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ ఏకగ్రీవ ఎన్నికల్లో ముత్తినేని వెంకన్న మండల అధ్యక్షుడిగా, సూరారపు లింగయ్య ప్రధాన కార్యదర్శిగా వరుసగా రెండోసారి ఎన్నికై ఉపాధ్యాయుల నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులుగా కీత వీరేంద్ర, మహిళా ఉపాధ్యక్షురాలిగా డి పద్మ, కోశాధికారిగా జి రాంబాబు, ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్గా బి రామ్ జి, వివో టి టి కన్వీనర్గా సిహెచ్ గోవింద్ భవిష్యత్ కార్యాచరణకు సారథులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్తినేని వెంకన్న, సూరారపు లింగయ్యలు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో వరుసగా రెండోసారి అత్యున్నత బాధ్యతలు అప్పగించిన పెన్ పహాడ్ మండల ఉపాధ్యాయులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల తక్షణ పరిష్కారానికి తమ నూతన కమిటీ నిరంతరం ముందుంటుందని, క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల పక్షాన నిలిచి పోరాటాలు ఉధృతం చేస్తామని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని పునరుద్ఘాటించారు. ఈ ఉత్సాహభరిత ఎన్నికల మహోత్సవంలో జిల్లా ముఖ్య నాయకులు, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సంఘం ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొని నూతన బాధ్యతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా మణిప్రసాద్ ఎన్నిక

వలిగొండ నవంబర్ 10(ప్రజాజ్యోతి న్యూస్)

మండలంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎంఆర్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంఎస్ఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నల్ల మత్సగిరి, అధ్యక్షుడిగా దేశపాక మణిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కాడిగాళ్ల అరుణ్, ప్రధాన కార్యదర్శిగా కడమంచి కార్తీక ఎన్నికయ్యారు. అలాగే ఎంఎస్యూ అధ్యక్షుడిగా వివేక్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎడవెల్లి రమ్మితను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బ రామకృష్ణ, కందుల నరేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజు నాయక్

మఠంపల్లి నవంబర్ 10 (ప్రజా జ్యోతి)

మఠంపల్లి మండలం మంచ్య తండా గ్రామ అభివృద్ధిలో భాగంగా డ్రైనేజీ నిర్మాణ పనులకు మఠంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్య మంజు నాయక్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి,ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, భూక్య మంజు నాయక్లకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచ్య తండా సర్పంచ్ మాలోత్ భద్రమ్మ బాబు నాయక్, ఉప సర్పంచ్ రూపావత్ బుల్లి రాము, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు నవీన్ నాయక్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పంటిపోలు శ్రీనివాస్, వర్ధాపురం సర్పంచ్ రామ్మూర్తి, భీల్యానాయక్ తండా సర్పంచ్ రాముడు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూక్య రాయసాల్ కు పరామర్శ

మఠంపల్లి నవంబర్ 10 (ప్రజా జ్యోతి)

మఠంపల్లి మండలంలోని మంచ్య తండాకు చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భూక్య రాయసాల్ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మఠంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్య మంజు నాయక్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా రాయసాల్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలకు కష్ట సమయాల్లో అండగా ఉంటామని భూక్య మంజు నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ధరావత్ నవీన్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఒంటిపులి శ్రీనివాస్,కిసాన్ సెల్ నాయకులు వల్లపుదాసు దుర్గయ్య గౌడ్, ఎల్వైచ్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మాలోతు నాగు నాయక్,సర్పంచులు మాలోతు భద్రమ్మ బాబు నాయక్, బానోతు రాముడు నాయక్, వల్లపుదాసు రామ్మూర్తి గౌడ్, మాజీ సర్పంచ్ సపావత్ సక్రియ నాయక్, ఉప సర్పంచ్ బుల్లి రాము నాయక్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డికి ఘనంగా జన్మదిన వేడుకలు

పెద్దవూర నవంబర్ 10 (ప్రజా జ్యోతి)

మండలంలోని మంగళవారం మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, శ్రేయోభిలాషులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం లింగారెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ వార్డ్ కౌన్సిలర్ పగడాల నాగరాజు యాదవ్, రామావత్ పాండు నాయక్, నరేష్, జానకి రామ్, మోహన్ బాబు, రాంబాబు, అనిల్, నాయనవానికుంట తండా కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొని లింగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన చింతపల్లి మాజీ సర్పంచ్ నట్వా గిరి బృందం

- దేవరకొండ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ బలోపేతంపై చర్చ

నల్లగొండ, నవంబర్ 10, (ప్రజా జ్యోతి ప్రతినిధి) :

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు, చింతపల్లి మాజీ సర్పంచ్ నట్వా గిరి ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ నాయకుల బృందం మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కేటీఆర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.అనంతరం దేవరకొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొల్కులపల్లి కొండల్, నల్ల శంకర్, భాస్కర్ చారి, స్వామి, ఫయాజ్, ఆసిఫ్, ఆవుల సుధాకర్, భాస్కర్, శ్రీను, చనమోని అంజి, బాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



"ప్రజాజ్యోతి"" ఎఫెక్ట్ తో బాలికలను వేధించిన నిందితుడి అరెస్ట్

- గురుకులంలో బాలికలకు భద్రత కరువైందా?
- ప్రజాజ్యోతి ఎఫెక్ట్ తో బాలికలను వేధించిన నిందితుడి అరెస్ట్
- విద్యార్థినుల పట్ల పారిశుద్ధ్య కార్మికుడు నిందితుడిని అరెస్టు చేసి ఉద్యోగం నుంచి శాశ్వతంగా విముక్తి
- కాంట్రాక్టు ఉద్యోగుల అహరనుంచి అసభ్య ప్రవర్తన...



నల్లగొండ, నవంబర్ 10(ప్రజా జ్యోతి ప్రతినిధి):

నిడమనూరు గురుకుల పాఠశాల విద్యార్థినులను వేధించిన నిందితుడు దినేశ్ ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) ప్రేమకరణ్ రెడ్డి తెలిపారు. విచారణ నిమిత్తం నిందితుడిపై చర్య లు తీసుకుంటామని..ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కొనసాగుతున్న దినేశ్ ను శాశ్వతంగా విధులనుంచి తొలగించినట్లు తెలిపారు. సిబ్బంది వ్యవహరించిన తీరుపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంఈవో పద్మ, ఎంపీడీవో వేదరక్షిత పాల్గొన్నారు. అనంతరం నిడమానూరు గురుకుల పాఠశాల ముందు తల్లిదండ్రుల ఆందోళన నిడమనూరు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల



పాఠశాల ముందు బిఆర్ ఎస్ వి ఆధ్వర్యంలో విద్యార్థినుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపట్టారు. పాఠశాల ముందు రహదారి బ్లాక్ చేసి బైఠాయించి నిరసన తెలిపారు. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో పాఠశాల ముందు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

పెండింగ్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన డైరెక్టర్ సురేష్ బాబు

సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 10(ప్రజా జ్యోతి):

సూర్యాపేట జిల్లాలో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) డైరెక్టర్ సురేష్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన మునగాల మండలంలోని బరాఖత్ గూడెం గ్రామ పంచాయతీని సందర్శించి,స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలు తీరు,పురోగతిని క్షేత్రస్థాయిలో







పరిశీలించారు.అనంతరం సూర్యాపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.హరిసింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓలు), మండల పంచాయతీ అధికారులు (ఎంపీఓలు), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, వీబీ-జీ రామ్ జీ కంప్యూటర్ ఆపరేటర్లతో వివిధ కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు.ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, స్వయం సహాయక సంఘాల భవనాల్లో సామూహిక పారిశుద్ధ్య సముదాయాల ఏర్పాటు, ఎస్ఈఈఈపీసీ సర్వే వివరాల పరిశీలన, డ్రెయిన్ల చివరలో సోక్‌పిట్ల నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా వ్యర్థాల వేరు చేసే షెడ్ల ఏర్పాటు,ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాల నిర్మాణాలపై చర్చించారు.ఆయా కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, లోపాలను సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడుతూ, నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ శిరీష, డీపీఓ యాదగిరి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇంట్రా గ్రిడ్ అధికారులు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) ఐఈసీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

బీమాతోనే కుటుంబాలకు ఆర్థిక రక్షణ

- ఇన్సూరెన్స్‌పై అవగాహన

- నలుగురు నామినీలకు

బీమా చెక్కుల పంపిణీ

గరిడేపల్లి,నవంబర్ 10 (ప్రజా జ్యోతి):



ప్రతి ఒక్కరూ జీవిత బీమా, ప్రమాద బీమా పాలసీలు తీసుకో వడం ద్వారా కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించుకోవాలని ఎస్‌బీ ఐ ఆర్‌ఎం అనిల్ కుమార్ సూ చించారు.జన సురక్ష శాచురేష న్ కార్యక్రమంలో భాగంగా మంగ ళవారం గరిడేపల్లి గ్రామంలో ఆర్థి క అక్షరాస్యత,ఇన్సూరెన్స్‌పై అవ గాహన కార్యక్రమం నిర్వహించా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బ్యాంకు ఖాతాదారుడు తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు.ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పిఎంజెజెబివై),ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎం ఎస్బివై) ద్వారా జీవిత,ప్రమాద బీమా రక్షణ పొందవచ్చని వివరించారు.బీమా పాలసీల ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని,కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినప్పు డు బీమా పరిహారం కుటుంబాని కి ఆర్థికంగా అండగా నిలుస్తుంద ని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గరిడేపల్లి గ్రామానికి చెందిన పిట్ట శ్రీను మృతితో ఆయన నామినీ వనజకు, గుండెబోయిన వెంకటేష్ నామినీ లింగయ్యకు,షేక్ జానీ పాషా నామినీ హానిఫ్‌కు,గుగులోతు నాగేశ్వరరావు నామినీ హరి చంద్రుడుకు పిఎంజెజెబివై, పీఎంఎస్బివై బీమా పథకాల కింద మంజూరైన చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎఫ్ఐ మేనేజర్ మూర్తి, ఐకేపీ ఏపీఎం అజయ్,ఎస్‌బీఐ మేనేజర్ సయ్యద్ నఫి,గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య,ఉప సర్పంచ్ మాతం గి సంజీవ్,గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు,గరిడేపల్లి సీఎస్పీ రాజేష్, సునీత, హుజూర్‌నగర్ సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు గోపి,శ్రవణ్ కుమార్, రాంబాబు,బిల్ కలెక్టర్లు రావుల వెంకన్న గౌడ్,సూదిరెడ్డి నర్సిరెడ్డి,వివోఏ లు పద్మ,కమల,రవీందర్ రెడ్డి స్రవంతి, ఎఫ్ఏ మేకపోతుల సరిత,ఆశాకార్యకర్త లు,గ్రామస్తులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో అధ్యాపక పోస్టుకు ఆహ్వానం

నల్లగొండ, నవంబర్ 10(ప్రజాజ్యోతి ప్రతినిధి):

నిడమనూరు మండల పరిధిలోని మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి నిర్మల తెలిపారు.ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న టిజిటి సోషల్ పోస్టుకు అర్హత కలిగిన వారు తమ ఒరిజినల్ ధ్రువ పత్రాలతో , రెండు సెట్ల్ జిరాక్స్, బయోడేటా తో నవంబర్ 12 తేదిన పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3.0 గంటల వరకు హాజరు కాగలరని ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు .సంప్రదించవల్సిన ఫోన్ నెంబర్ 9010949936 తెలిపారు.



ప్రమాదాలకు అడ్డుకట్ట.. గుంతలకు పోలీసుల మరమ్మతులు

- అధికారుల నిర్లక్ష్యం.. పోలీసుల చొరవ!

గరిడేపల్లి,నవంబర్,10(ప్రజా జ్యోతి):

ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడం తో గరిడేపల్లి పోలీసులు చొరవ తీసుకు న్నారు.పొనుగోడు,గడ్డిపల్లి గ్రామాల సమీపంలో జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతలను ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వ ర్యంలో పోలీసు సిబ్బంది మట్టితో పూ డ్చారు.ఇటీవల ఈ ప్రాంతంలో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నా రు.పరిస్థితిని గుర్తించిన ఎస్ఐ సిబ్బంది తో కలిసి స్వయంగా శ్రమ దానం చేసి గుంతలను పూడ్చి వేయించారు.తాత్కాలికంగా చేపట్టిన ఈ పనులతో వాహన దారులకు కొంత ఉపశమనం కలిగింది. ప్రజల భద్రత కోసం పోలీసులు చూపిన చొరవపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గుంతలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

